క్లుప్తంగా

కవి సమ్మేళనం బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్లను విడుదల చేస్తున్న కవులు, రచయితలు, కళాకారులు

అమలాపురం టౌన్: జిల్లా శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ ఏడున అమలాపురంలో జరగనున్న ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళానికి సంబంధించిన బ్రోచర్ల ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక కూచిమంచి అగ్రహారంలో శుక్రవారం జరిగింది. అమలాపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరగనున్న 132వ శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్లను స్థానిక అశ్విని పిల్లల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కె.శశికిరణ్ ఆవిష్కరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కవులు పాల్గొంటారని వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కత్తుల ఆనందరావు, వైఆర్కే నాగేశ్వరరావు, కడలి రామలక్ష్మి, డి.సత్యవేణి, డాక్టర్ అనూష, వేదిక కార్యవర్గ సభ్యుడు కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

ముమ్మిడివరం: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6,810 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీహెచ్ గున్నేపల్లి కొబ్బరి తోటలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్సై డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసి, నగదు, ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అగ్ని బాధితులకు సాయం



బాధితులకు సాయం అందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అమలాపురం రూరల్: రెడ్డిపల్లిలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అమలాపురం వేంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు కలిసి రూ.15 వేల విలువైన సాయాన్ని అందజేశారు. వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదును శుక్రవారం అందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏఓ కరాటం ప్రవీణ్ వాటిని అందజేశారు. అధ్యాపకులు కె.శ్రావణ్‌దిలీప్, యాలంగి వరప్రసాద్, బి.శ్రీనివాస్, ఎం.సూర్యకుమారి, కె.సత్యశ్రీ, కె.హేమవిజిత, మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి నగదు, పండ్లు పంపిణీ చేశారు.

ట్రై సైకిల్ అందజేత



ప్రమీల కుటుంబ సభ్యులకు ట్రై సైకిల్ అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామానికి చెందిన సరెళ్ల సంపదరావు కుమార్తె ప్రమీల పుట్టుకతోనే వికలాంగురాలు. ఆమె తిరిగేందుకు ట్రై సైకిల్ లేక ఇబ్బందులు పడుతుందని తెలుసుకుని అమలాపురం వైఎస్సార్ సీపీ నాయకులు.. గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి ప్రమీలకు ట్రై సైకిల్ సమకూర్చారు. ప్రమీల కుటుంబ సభ్యులకు శుక్రవారం ట్రై సైకిల్‌ను ఫౌండేషన్ సభ్యులు అందజేశారు.

సక్రమంగా 27 నామినేషన్లు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి నామినేషన్ల పరిశీలనలో 27 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని శుక్రవారం రిటర్నింగ్ అధికారి ఎ.కులొతుంగన్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్, ఏఐఏడీఎంకే తదితర పార్టీలు, ఇండిపెండెంట్లు మొత్తం 45 మంది నామినేషన్లు దాఖలు చేశారన్నారు. ప్రధాన అభ్యర్థులైన బీజేపీ అభ్యర్థి నమశ్శివాయం, కాంగ్రెస్ అభ్యర్థి వైథిలింగం, ఏఐఏడీఎంకే అభ్యర్థి తమిలవేదన్ నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు. వాటిని ఆయా పార్టీల నేతల సమక్షంలో స్క్రూటినీ నిర్వహించినట్టు తెలిపారు. మొత్తం మీద 18 నామినేషన్లు తిరస్కరించినట్టయింది.

అక్రమ మద్యం ధ్వంసం

ఆలమూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో శుక్రవారం అక్రమ మద్యం బాటిళ్ల ధ్వంసం జరిగింది. రాష్ట్ర ఎస్ఈబీ డిప్యూటీ కమిషనరేట్ ఆదేశాల మేరకు అమలాపురం ఏఎస్పీ అమర్‌బాబు సమక్షంలో ఎస్సై ఎ.సత్యవేణి ఆధ్వర్యంలో సుమారు రూ.90 వేలు విలువైన 1152 మద్యం బాటిళ్లు, 184 లీటర్ల సారా ధ్వంసం చేశారు.

సీఎం జగన్‌తోనే పాలన చేరువ

- అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్
- భట్నవిల్లి, కామనగరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



భట్నవిల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్



ఇంటింటా ప్రచారంలో మహిళలకు కరపత్రాలు ఇస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ప్రజలకు సేవలు, సంక్షేమ పాలనను అందించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందంజలో ఉన్నారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రూరల్ మండలం భట్నవిల్లి, కామనగరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ నాయకులతో కలసి నిర్వహించారు. తొలుత భట్నవెల్లి శెట్టిపేటలో విజయదుర్గా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా 216 జాతీయ రహదారి జనంతో కిక్కిరిసింది. వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచార రథం పైనుంచి విశ్వరూప్ ప్రజలకు అభివాదం చేశారు, ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన విశ్వరూప్‌కు మహిళలు హారతులిచ్చి, నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా విశ్వరూప్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ క్రమంతప్పకుండా చేరాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ లబ్ధి చేకూరిందన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల కంటే, అధికారం చేపట్టాక మరిన్ని హామీలు జోడించి నెరవేర్చారన్నారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డొలమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాస్, కామిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్‌లు తిరుకోటి సూజాత, నక్కా అరుణకుమారి, డీసీసీబీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ, ఎంపీటీసీ తొత్తరమూడి మరియమ్మ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, గ్రామ కమిటీ నాయకులు పాక జాన్, పెచ్చెట్టి శ్రీరాములు, దూనబోయిన రవికుమార్, మామిడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సూదా గణపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని కలిసిన ఇందుకూరి



నరసింహరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన పి.గన్నవరం మండలం రాజుపాలానికి చెందిన ఇందుకూరి నరసింహరాజు శుక్రవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను గోడిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహరాజుని ఎమ్మెల్సీ శాలువాలతో సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించడంలో కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల రామకృష్ణ, జిల్లా రైతు విభాగ కార్యదర్శి చేట్ల సత్యనారాయణ, మాకే వెంకటరమ, నవుండ్రు రమేష్ పాల్గొన్నారు.

లయన్స్, లియో క్లబ్ సేవా కార్యక్రమాలు



వడ్డిగూడెంలో మొక్కలు నాటుతున్న సూర్యనారాయణ తదితరులు

అమలాపురం టౌన్: వడ్డిగూడెంలో లయన్స్ క్లబ్, వాగ్దేవి లియో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పలు వితరణ కార్యక్రమాలు జరిగాయి. లయన్స్ జిల్లా గవర్నర్ వేలూరు సూర్యనారాయణ పర్యటనలో భాగంగా ఆయన చేతుల మీదుగా ఆయా సేవా కార్యక్రమాలు చేపట్టారు. వడ్డిగూడెంలో ఐదు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పర్యావరణ చైతన్య కార్యక్రమంలో భాగంగా పచ్చని మొక్కలు నాటారు. లయన్స్, లియో క్లబ్‌ల అడ్మినిస్ట్రేటర్, జోన్ చైర్‌పర్సన్ జంపన సుమన్‌వర్మ ఆర్థికసాయంతో శ్రీ వాగ్దేవి లియో క్లబ్ చైరపర్సన్ జంపన శ్రీసౌమ్య, ఆ క్లబ్ ప్రతినిధి జంపన సిద్ధార్థ వర్మ పర్యవేక్షణలో ఈ సేవా కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ అనిల్‌కుమార్ జైన్, రీజనల్ చైర్‌పర్సన్ ముదునూరి శ్రీరామరాజు, స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, పరసా రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి విశ్వరూప్ ఎన్నికల ప్రచారం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం ఒకటో వార్డు పరిధిలోని చింతగుంట చెరువు ప్రాంతంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ శనివారం ఉదయం నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారని పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. మంత్రి విశ్వరూప్ చేపట్టే ఈ ఎన్నికల ప్రచారంలో పట్టణంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి కృషి

పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్



నరసింహరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా శ్రమించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన నాయకుడు ఇందుకూరి నరసింహరాజు ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను అమలాపురంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పార్టీ విజయానికి పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన విషయాలపై ఎమ్మెల్యే కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం నరసింహరాజును సత్కరించారు. అనంతరం నరసింహరాజు అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను వారి స్వగృహాల్లో వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ, ఎమ్మెల్సీలు కూడా ఆయనను సత్కరించారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి



అల్లవరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ



భీమనపల్లిలో సీఐ వీరబాబు ఆధ్వర్యంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న స్క్వాడ్

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కేశవవర్ధన రెడ్డి ఆదేశించారు. అల్లవరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలను ఆర్డీఓ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 వేలు మించి నగదు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్లరాదని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీ-విజిల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులను 90 నిమిషాల్లో పరిష్కారించాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన, ఎన్నికల కోడ్ అమలుపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఏడుకొండలు, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన స్క్వాడ్

ఉప్పలగుప్తం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించింది. మండలంలోని కూనవరం గ్రామంలో ఆర్డీఓ జి.కేశవ వర్ధన్ రెడ్డి, భీమనపల్లి గ్రామంలో అమలాపురం సీఐ పి.వీరబాబు.. ఎస్సై కె.మనోహరజోషి, ఈఓపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, ఏఎస్సై ఎస్.శ్రీనుబాబుతో కలసి శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు.

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన పితాని



మంత్రి విశ్వరూప్‌ను కలిసిన పితాని

అమలాపురం రూరల్: జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ ఇంచార్జి పితాని బాలకృష్ణ ఆ పార్టీకి రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పినిపే విశ్వరూప్‌ను శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. కామనగరువులో ఎన్నికల ప్రచారంలో ఉన్న విశ్వరూప్‌ను కలిసి, కొంత సమయం మాట్లాడారు పితాని రాకతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో శనివారం పార్టీలో చేరనున్నట్టు బాలకృష్ణ తెలిపారు.

మెరుగైన పనితీరు కనబర్చాలి

అధికారులతో పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ చౌహాన్



మొక్కను నాటుతున్న సీఎస్ చౌహాన్

యానాం: ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల పరంగా మెరుగైన పనితీరును కనబర్చాలని, ప్రజలకు అందించే సేవలు మరింత చేరువ కావాలని పుదుచ్చేరి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శరత్‌చౌహాన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో శాఖల వారీగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, పీడబ్ల్యూడీ, విద్యుత్, మత్స్య, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో వేర్వేరుగా మాట్లాడారు. యానాంలో శాఖాపరంగా ఉన్న సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తానన్నారు. అదేవిధంగా సాధారణ ఎన్నికల్లో భాగంగా వచ్చే నెల 19న జరిగే పోలింగ్ ఏర్పాట్లపై సమీక్షించానన్నారు. గోపాల్‌నగర్ డంపింగ్‌యార్డు రిసోర్స్ పార్క్ సమస్యపై అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. స్థానిక ఆర్ఏఓ ప్రాంగణంలో సీఎస్ శరత్‌చౌహాన్ మొక్కలు నాటారు. ఈ సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి, జీజీహెచ్ డీడీ రవిశంకర్, ఎస్పీ రాజశేఖరన్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా మల్లాడి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో యానాం నియోజకవర్గానికి ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావును నియమిస్తూ ఆ పార్టీ కార్యదర్శి ఎన్ఎస్‌జే జయబాల (అయ్యన్నార్) ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా హోం మంత్రి నమశ్శివాయం పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు మద్దతుగా మల్లాడి ప్రచారం చేయాల్సిన బాధ్యత అప్పగించినట్టయింది. ఇప్పటికే బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్డీఏ కూటమికి మద్దతునిస్తున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను సైతం బీజేపీ తన ఇన్‌ఛార్జిగా నియమించిన సంగతి తెలిసిందే.

నేడు వీరేశ్వరస్వామి హుండీ లెక్కింపు

ఐ పోలవరం: మురమళ్లలో కొలువైన వీరేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈనెల 30న (శనివారం) హుండీ లెక్కింపు చేపడుతున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి సమక్షంలో లెక్కింపు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొనాలని కోరారు.



ముల్లా ముస్తఫా మసీదులో ఇఫ్తార్ విందు చేస్తున్న ముస్లింలు

ఆత్మీయంగా ఇఫ్తార్ విందు

అమలాపురం టౌన్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అమలాపురం ముల్లా ముస్తఫా మసీదులో శుక్రవారం సాయంత్రం ఆత్మీయ వాతావరణంలో ముస్లింలు ఇఫ్తార్ విందు చేశారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు మసీదులో ఖురాన్ పఠనం, నమాజ్‌లు, ప్రత్యేక ప్రార్థనల్లో నిమగ్నమయ్యారు. సాయంత్రం ఉపవాస దీక్షను విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొని, ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలు చేసుకున్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, బోర్డు డైరెక్టర్ అలీషా, పట్టణ వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అన్వర్ రాజా, ముస్లిం నాయకులు ఖ్వాజాబాబు, ఎండీ బషీర్, జహీరుద్దీన్, బాషా జాన్, ఖాన్ తదితరుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది.

గంగాధర్ ప్రతాప్ సేవలు చిరస్మరణీయం



గంగాధర్ ప్రతాప్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

యానాం: పేద, బడుగు, బలహీన వర్గాలకు యానాం నియోజకవర్గ నేత దివంగత గొల్లపల్లి గంగాధర్ ప్రతాప్ చేసిన సేవలు చిరస్మరణీయమైనవని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి గంగాధర్ ప్రతాప్ 59వ జయంతిని పురస్కరించుకుని స్థానిక కె-జంక్షన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధిక సంఖ్యలో గొల్లపల్లి అభిమానులు హాజరయ్యారు. ముందుగా గంగాధర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కుల, మత, వర్గాలకతీతంగా అనేక సేవలందించిన పేదల పెన్నిధి గంగాధర్ ప్రతాప్ అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకి నాగేశ్వరరావు, కనకాలరాజు, సత్తిబాబు, చెక్కల అరుణ్‌కుమార్, అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బలియాగంతోనే పాప విముక్తి

ఘనంగా గుడ్ ఫ్రైడే ఆరాధనలు



యానాంలో శిలువ మార్గ యాత్రలో పాల్గొన్న క్రైస్తవులు

అమలాపురం టౌన్: పట్టణంలోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే ఆరాధనలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక నల్ల వంతెన వద్ద ఉన్న మన్నా జూబ్లీ చర్చిలో జరిగిన గుడ్ ఫ్రైడే ఆరాధనోత్సవాల్లో వేలాది మంది క్రైస్తవులు పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ చర్చి ప్రధాన కాపరి, జిల్లా పాస్టర్ల యునైటెడ్ ఫెలోషిప్ అధినేత కార్ల్ డేవిడ్ కొమనాపల్లి (లాల్) గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు. క్రీస్తు బలియాగం వల్లే సర్వ లోక పాప విముక్తి జరిగిందన్నారు. ఏసు శిలువలో చిందించిన రక్తం ద్వారా అందరూ పరిశుద్ధ ఆత్మతో లోక రక్షణకు ప్రార్థనలు చేశారని వివరించారు. పాస్టర్లు రెవ, ఎర్నెస్ట్ తాతపూడి, రెవ.ఎస్తేరు తాతపూడి ప్రసంగించారు. ఈ సందర్భంగా మన్నా చర్చి క్వాయర్ బృందం క్రీస్తు బలియాగంపై పాడిన పాటలు హృదయాలను ద్రవింపజేశాయి. అలాగే ఏసు శిలువపై రక్తం చిందించిన సందర్భాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు.

యానాం: గుడ్‌ఫ్రైడే పవిత్ర ప్రార్థనలు యానాం పట్టణంలోని పలు చర్చిల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చారిత్రక రోమన్ కేథలిక్ చర్చిలో ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో యానాం కుయ్యేరు, కోలంక, జార్జిపేట, మంజేరు, కాజులూరు పరిసర ప్రాంతాల నుంచి భారీఎత్తున ఉపవాసంలో ఉన్న క్రైస్తవులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంఎల్‌కే నగర్ నుంచి యానాం ఆర్‌సీఎం చర్చి వరకు శిలువ మార్గం యాత్రలో వందలాది మంది పాల్గొన్నారు. అదేవిధంగా అంబేడ్కర్‌నగర్, మెట్టకూరు, కురసాంపేట, పరంపేట, దరియాలతిప్ప, గాంధీనగర్ తదితర ప్రాంతాల చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి.

అల్లవరం: సర్వ మానవాళి రక్షణ కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజునే గుడ్ ఫ్రైడేగా జరుపుతారని పాస్టర్ నవీన్‌కుమార్ అన్నారు. గోడితిప్పలోని క్రీస్తు ఆదరణ ఆలయంలో పాస్టర్ నవీన్ కుమార్ క్రీస్తు ప్రార్థనలు నిర్వహించారు.



గోడితిప్ప ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

అమలాపురం రూరల్: అమలాపురం మండలం ఈదరపల్లిలో బైబిలు మిషన్‌ను స్వస్థత శాలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఆరాధన ఘనంగా నిర్వహించారు. సీనియర్ సంఘ కాపరులు ఎ.ఫ్రాయిమ్, విక్టోరియారాణి ప్రసంగించారు. పట్టణంలో శిలువ సువార్త యాత్ర నిర్వహించారు.

ఒకటి నుంచి బ్యాలెట్ పత్రాల పంపిణీ

- తొలిసారి 28,921 మంది ఓటర్లు
- వందేళ్లకు పైబడిన ఓటర్లు 97 మంది

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి వచ్చేనెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఏప్రిల్ ఒకటి నుంచి బ్యాలెట్ పేపర్లను పంపిణీ చేయనున్నట్టు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎ.కులొతుంగన్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో మొత్తం 10,23,699 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో 5,42,979 మంది మహిళలు, 4,80,569 మంది పురుషులు, 151 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారని వివరించారు. తొలిసారిగా ఈసారి 28,921 మంది యువ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారన్నారు. 80 ఏళ్లు పైబడిన వారు 38,684 మంది, 85 ఏళ్లకు పైబడి 8,031 మంది, వందేళ్ల వారు 97 మంది ఉన్నారన్నారు. 13,141 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారన్నారు. అదేవిధంగా 325 మంది సర్వీస్ ఓటర్లు, 368 మంది నాన్ రెసిడెంట్ ఓటర్లు ఉన్నారన్నారు. రెండు రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లను తొలగించినట్టు తెలిపారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 967 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్టు, వీటిలో 232 సమస్యాత్మక బూత్‌లుగా గుర్తించినట్టు చెప్పారు. వీటిలో పుదుచ్చేరిలో 180, కారైకల్‌లో 35, మరో 10 అతి సమస్యాత్మక బూత్‌లుగా గుర్తించినట్టు తెలిపారు. అన్ని బూత్‌లకు సర్వైలెన్స్ కెమేరాలు అమర్చినట్టు, 4 వేల మంది పోలింగ్ ఆఫీసర్లను నియమించినట్టు చెప్పారు. రెండు కంపెనీల పారా మిలటరీ దళాలు విధులు నిర్వహిస్తున్నాయన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి బ్యాలెట్ పత్రాల పంపిణీ, ఏప్రిల్ రెండు నుంచి వాటిని ఇంటింటికీ వెళ్లి కలెక్ట్ చేస్తారన్నారు.